# "మార్గదర్శి"

శ్రీ సన్నాకుల సుందరరావు B. Com.

సుధ, నిరాశా నిస్పృహాలతో కాంతివిహీనమైన నేత్రాలను గోడ గడియారం మీదికి పోనిచ్చింది. బూజు పట్టిన గడియారం! సందె వెలుగుల్లో అంకెలు స్పష్టంగా కనిపించలేదు. బాధతో, రోడ్డుపైనున్న దీపస్తంభాన్ని దృష్టించాయి ఆమె నేత్రాలు

వీధి అంతా నిశ్శబ్దమయం. పట్నవాసులు కడగా వుంచినట్లు, వీధిలో రోడ్డుకూడా, సుగమ్యంగా లేదు. పేరుకు పట్నం-అందానికి అంతరాయం!! అందాలు ఆడంబరాలు, రోడ్లూ తీర్చి దిద్దటాలూ దేనిలో వున్నయ్? అవి నివసించేది వాటి అందాలు తిలకించి ఆనందించేది, ధనరాసులు. ఔను – కళ బీదవాడి వద్దవుంటే రాణింపు ఏదీ? కళకు తగ్గట్టు మెరుగు లేకపోతే ఆ కళ ఏమౌతుంది?? వున్నటువంటి సంస్కారాన్ని – సౌభాగ్యాన్ని అనుభవించటం చేతకాని వారికి వాటివల్ల లభించేదేమిటి? సుఖం నాస్తి! సంపద నిర్వీర్యం..

సుధ, ఓసారి తన జీవితపు కారు మబ్బుల్లోకి తొంగి చూసింది. లోకానికి వెలుగిచ్చి సకలజాతులకూ ఇంత పెట్టి పోషకారకుడైన, సూర్యునికూడా, వెలుగును మభ్యపరుస్తూ, కారు మబ్బులు బంధిస్తూనే వుంటయ్. కాని లోకసంచారకుని క్షణమాత్రమే ఆవరించగలవు. ఎల్లకాలమూ అడ్డు పెట్టలేవు. ఆయన, మరి అజేయుడు. ఆయనకు వచ్చే ఆటంకాలన్నీ జ్వాలలతో హరించివేయగలడు. కాని వ్యక్తిత్వంలో వచ్చే ఆటంకాలు జయించటానికి కావల్సిందేమిటి? అది ఒక్కటే ఒక్కటి–దాని పేరుచెప్పితే శుష్కించిన అస్థిపంజరాలు గూడు కట్టుకొని పోయిన అవయవాలు లేచి నిల్చుంటయ్; బలప్రధానంతో నిండిన శరీరాలు ప్రస్ఫుటంగా నవ్వుతాయి. నీతి నిజాయితీలు లెక్క చేయక ఆత్మతో హాస్యాలు ముకుళిస్తాయ్. అది రహస్యప్రధానం. మానవలక్ష్య సాధ్యం. కష్టాలకు భూతదండమ్. అపరమ వస్తువు! ఆపద్బ్రాయుధం!! ఒక్క మాటలో చెప్పితే_ధనం!!!...

ఆ ధనాన్ని అనుసరించే సామెతలు ఉద్భవించినయ్. ధనంలేని సాహిత్యం, కళ, నిర్జీవమై పోయాయ్. రెండూ, సజీవమైనవే, కాని వాటి నివాసస్థలాలను బట్టీ విలువలు మారటం సమంజసమై పోయింది.

◆ ◆ ◆

సుధకు, జీవితంలో నా అనే వారంటూ లేరు. ప్రపంచంలో తనకు ఆప్తులెవ్వరా అంటే తనూ - తన శరీరం. పొట్టపోసుకోవటానికి తను పడుతున్న బాధలు చూస్తూ వుంటే ఒక్కోసారి జీవితం మీద విరక్తి పుడుతూ యుండేది.

కష్టాల పరంపరలో సుధకు వ్యక్తికుండవలసిన ఓర్పంతా హరించి పోయింది.

విశాల ప్రపంచం. లక్షలాది ప్రజల నివాసం. గ్రామాలలో వేలు, పట్టణాలలో లక్షలు; నివాస యోగ్యం. ఆ లక్షల్లో – సుష్టుగా భోంచేసి శరీరాన్ని దాచుకోవటానికింత గుడ్డముక్క గలవారు లెక్క కొస్తే తక్కువే. అటువంటి సమాజంలో బ్రతికేం? ఆ బ్రతుకువల్ల లాభమేమిటి?? అసలీ మానవ జన్మ రహస్యమేమిటి?

న్యాయానికొస్తే సృష్టికర్త; దయా స్వరూపుడనీ ఆపద్బాంధవుడనీ, ఆశ్రిత రక్షకుడనీ, నిష్పక్షపాత స్వభావుడనీ, వేదాలు, శ్రోతలూ, భక్తులు వర్ణించి వల్లిస్తారు. ఈ పేదరికం, నికృష్టజీవుల ఆకలిబాధలు సర్వేశ్వరుడు ఎలా చూస్తూయున్నాడు? ఔను; ధనికుడు పుట్టేటీ రెండు కాళ్లు రెండు చేతులు, రెండు కళ్లతోనే పుడ్తాడు. పేదవాడు పుట్టే విధానం

చూసినా అంతే. మరి కష్టసుఖాల తారతమ్యాలు ఏర్పడిందెలా??

న్యాయానికి శాస్త్రప్రకారం స్త్రీ పురుషులకు అన్నిరంగాలలో సమాన స్వతంత్రం వుంది. అయితే, స్త్రీ తన బ్రతుకు తెరువు చూసికోటానికి బయలుదేరినప్పుడు ఆమెకు ఆశ్రయమిచ్చే వారు లేనేలేరు. ఆడది అంటే ఓ నీచమైన వస్తువా? సమాజం దృష్టిలో విలువలేనిదా? ధనిక కుటుంబాలలో పుట్టిన అబల సబలే. ఎందుచేతంటే ఆమెకు తన స్వయంపోషణకై పడిగాపులు పడే అవసరంలేదు. మరో వైపు ఆర్థిక స్తోమతులేని కుటుంబంలో పుట్టిన అబల అబలే. ఆ – అబల, సబల కావాలంటే సంఘాన్ని నడిపే తాంత్రికుల చేతుల్లో లొంగిపోవాల్సిందే. అలా లొంగనేరని పరిస్థితుల్లో ఆమె జయాన్ని ఎంతమాత్రం, సాధించలేదు

♦ ♦ ♦

సుధ, అటువంటి సూటి పోటులెన్నో రుచి చూసింది. ప్రాధేయపడే చోట తన అభిమానాన్ని కాలదన్నింది. తలవంచేచోట తలవంచే సూట్లాడింది.

తలిదండ్రులు పోయాక ఉద్యోగం కోసం ఎక్కే మెట్లు ఎక్కింది; దిగే మెట్లు దిగింది. అయితే స్త్రీ గౌరవంగా బ్రతకటానికి లభించే ఉద్యోగాలేవీ ఆమెకు లభించలేదు అది ఆమె అసమర్థతా కాదు. విద్యావిహీనతా కాదు. తప్పు సుధది, కానే కాదు; అదంతా సమాజం తీరు. ఆర్థిక స్తోమతు లేని గృహంలో జన్మించే నారిగతే ఇది. క్రిందవుండే వాడ్ని అధఃపాతాళానికి అణగద్రొక్కటం సమాజం యొక్క ముఖ్యలక్ష్యం. ఆ లక్ష్యాన్ని ఎదుర్కొనే శాస్త్రవేత్తలు విజ్ఞాన స్వరూపులు లేనేలేరు. విజ్ఞానం ఎంత పెఱుగుతూ రూపొందిందంటే, అది బలహీనుల్ని బలహీనులుగా చేయటానికే; మారణాయుధాలతో జనాన్ని మట్టుపెట్టడానికే.

♦ ♦ ♦

సుధ, నిలువుటద్దం ముందు కూర్చుని తన యౌవనాన్ని ఓ సారి పరీక్షించుకుంది. సౌందర్యం విషయానికొస్తే సుధను వ్రేలెత్తి చూపనవసరంలేదు. తీర్చిదిద్దిన కనుబొమలు గుండ్రని నేత్రాలు, నవీన భావాలు వెదజల్లే ముఖారవిందం, భారీ విగ్రహం, ఎత్తుకు తగ్గ శరీర సౌష్టవం. సమున్న అర్హతలూ, నవీన భావాలు తనలోవున్నయ్. అవి వున్న స్త్రీకి అనువైన ఉద్యోగం ఉదరపోషణకు "అఘాయిత్యం" అనే తెర మాత్రమే. ఆ తెర చాటున ఉన్నంతసేపూ స్త్రీకి పొగడ్తలు సుఖాలు, సంపదలు. ఆ తెరవిడచి ఇవతలి ప్రపంచంలో అడుగు పెడితే ఎత్తిపొడుపులూ, సాధింపులూను.

ఉదర రక్షణకు అన్వేషించిన ఉద్యోగాలన్నిటికీ, సుధ, అనర్హురాలుగా నిర్ణయమై పోయింది. ఉద్యోగాన్వేషణకు వెళ్లిన చోటల్లా, సుధను, సౌందర్యారాధన – శీల సమర్పణ, అడుగడుగు అంగీకరించటమే ప్రధానార్హతగా నిర్ణయించింది సమాజం. అంతే అంతటితో ఆమెకు జీవితంపై విరక్తిపుట్టింది ఆత్మహత్య చేసుకుందామనుకుంది. కాని ధైర్యం చాలలేదు. తనలో నివసిస్తున్న ఉదర జ్వాలతో ఆమెను లొంగదీసి గెలిచినయ్ అంతే; ఆ క్షణ నుండే సుధ జీవితం మారిపోయింది. ఆమె ఆశయాలు జీర్ణించాయి. ఆమెలో అంకురించివున్న దైవచింత పూర్తిగా తొలగిపోయినది. సమాజ శృంఖలాలకు ప్రణమిల్లింది. క్షుద్బాధ ఉపశమించటానికి, వన్నెలు తెచ్చి తీర్చిదిద్దిన తన అవయవ సౌష్టవాన్ని – సమాజానికి బలిపెట్టింది. విశాల భావాలు వెదజల్లే ఆమె అభిమానం ఒక్కుమ్మడిగా ఆమెను, వారంగనగా మార్చేశాయి.

♦ ♦ ♦

ఈనాడు సుధ అంటే ... సమాజం కస్సుమంటుంది. తోటి స్త్రీలోకం ఆమెను దుమ్మెత్తిపోస్తుంది. తమ సంసారాలు నాశనమయినందుకు కారణయోగ్యం ఫలాని ... సుధ, అని చెప్పే కంఠాలు వేలకొద్దీ వున్నయ్. సమాజ వినాశనానికి కారణం తనేనని పత్రికలెన్నో ప్రచారం చేశాయి,

సుధ తప్పు దీనిలో ఎంతవరకువుంది! ఏ సంస్కర్త ముందుకొచ్చి సుధ చేసిన అపరాధాన్ని రుజువుపరచగలడు?? దానికి సమాధానం యిదే. అపరాధాన్ని చూపించే మునివ్రేలు నీ అంతరాత్మకు ఎదురుగా తిప్పుకో. గద్దించేనీవు, భగవత్సాక్షికి చెప్పే జవాబేమిటి?

అందరి దారీ వేరు. సుధ దారి వేరు. పరిస్థితుల ప్రభావం ఆమెను గెలిచింది. గాని ఆమెకు అభిమానం లేకపోలేదు. అంతరాత్మ విమర్శ లేకపోలేదు. వేశ్యవృత్తినుండి తన పంథా మార్చుకోవాలని అను

ంది. విడచి బ్రతికేదెలా ? తన్ను చేరదీసేదెవరు ? ఏవ్యక్తి తనను స్వీకరించి దానివల్ల సమాజం కురిపించే నిందలను సహించగలడు ?

తనకు ఇష్టం వున్నా లేకపోయినా వచ్చే విటులకు దాసోహం అంటూ ముళ్లమీది జీవితాన్ని కౌగలించుకుంటూ; ఆ నికృష్టాన్ని క్షుద్బాధకు, ఆనందంగా ఇచ్చుకుంది సుధ.

ఒక వైపు తను అనుసరించిన వృత్తిని తలుచుకున్నప్పుడు దానిని అనుసరించే విమర్శలూ; సమాజం వేసే నిందలూ; జ్ఞప్తికివచ్చి సుధ దుఃఖించేది. కోటి స్త్రీలు పొందే ఆనందానికి అంతరాయం తనేనంటూ అందరూ వేలెత్తి చూపుతారు. వేశ్యా సాంగత్యం కోరే పెద్ద మనుషులూ, సమయం వస్తే ఆమెనే నిందిస్తారు.

ఆఖరుకు ఆ భగవంతుని దర్శించే హక్కుకూడా తనకులేదు. పరిస్థితుల పాపపంకిలాన్ని శుద్ధి చేసికోవటానికి ప్రయత్నించినా సమాజం అందుకు అంగీకరించదు. తను కనబడితే వ్యక్తులు గుసగుసలాడుతారు. చీదపురుగుక్రింద జమకడ్తారు. ఆ దీవెనలతోనే తను వెనక్కు వచ్చేస్తుంది. పవిత్ర దైవాన్ని కనీసం ఒక్కనాడూ ఆలయంలో వీక్షించ లేకపోయింది.

మహాత్ముల చిత్రాలు తెచ్చి పూజించటానికి; తన నివాసం పాపానికి నిలయం. ఆ చిత్రాల్ని కొంటానికికూడా ఉపయోగించే డబ్బు పాప ప్రమేయం. సుధ సాహసించలేక పోయింది. అభిమానం కొద్దీ కనీ కనపడకుండా, బూజుపట్టిన ఆగోడ మీద "దైవం" అని మాత్రం పెన్సిలుతో వ్రాసింది. ఆ మూడక్షరాల మాటే ఆమె ఆరాధ్య మూలం.

ఆ మాటను చూచినప్పుడల్లా "అమ్మా! పరిస్థితుల ప్రభావం; ఈ స్థితిలోనిన్ను బంధించినా ఆచరించే మార్గం నలుగురికీ ఆటంకం...... దీన్నుండి తొలగిపో తల్లీ" అంటూ ప్రభోధించేది అంతరాత్మ.

సుధకు ఆలోచించినంతసేపటికూ సత్యం గోచరించక పోలేదు. అంతర్వాణి ప్రబోధం మూడు మార్గాలా, యదార్థం. ఈ నాడు తను ఆ వృత్తికి స్వస్తి చెప్పుకుందామనుకున్నా ఆకటి బాధను తీర్చుకునేదెలా ? పరిస్థితుల ప్రభావం జయించలేక పోవటమే, గొప్ప బలహీనత. ఆ బలహీనతకు లొంగిపోవటమే - ప్రతిపాపానికీ దారి తీస్తుంది.

♦ ♦ ♦

సుధ, వణకుతున్న హృదయంతో గోడమీది దైవాన్ని స్మరించుకుంది. తన నిర్భాగ్య జీవితానికి కన్నీరు కార్చింది. పట్టణమంతా నిద్రాదేవి కౌగిలిలో నిద్రిస్తూంది. ఆమె కౌగిలిరుచి చూసే భాగ్యం తనకులేదు. రాత్రి రెండుగంటలైంది. ఆవేళ తను ఉపవాసవ్రతం చేసింది. కళ్లు కాంతివిహీనంగా తయారయినయ్. వీధి అంతా బురదమయం, ఆదినం ఇక తనకు ఆహారమంటూ లేదు.

ఆలోచనల్నుంచి ఇవతలకొచ్చింది సుధ. బరువుగా నిట్టూర్చింది. "స్వామీ ! నా జీవితాన్ని మార్చు, నాకంటిన ఈ పాప పంకిలాన్ని నీ కరుణాపూరిత నేత్రాలతో కడిగివేయి. నన్ను నీదానిగా స్వీకరించు" అంటూ మోకరించింది. తన గోడమీది దైవముందు. "అమ్మా ! నా హస్తాలు నిన్ను చేర్చుకోవటానికి ఎప్పుడూ సిద్ధమే. పాప మానవులకోసం తన శరీరాన్ని చిత్రవధకు అంకితం చేశాడు ఏసుక్రీస్తు; దేశరక్షణకు తుపాకి గుండకు హృదయాన్ని అర్పించాడు గాంధి. మోక్ష సాధనకై సుఖాలు త్యజించాడు గౌతముడు. వీరంతా నాబిడ్డలే. వెళ్లు తల్లీ; కోటి స్త్రీల జీవితాన్ని చరిదిద్దు, వారికి "మార్గదర్శి"గా జీవించు అంటూ అంతర్వాణి ప్రబోధించింది.

సుధ శరీరంలో నూతనశక్తి ఉద్భవించింది. స్వామి సన్నిధిలో చెమను హారించివేసింది. భారంగా లేచింది సుధ. సుధకు ఆదినం పర్వదినం. తనుండే వేశ్యావాడ గదికి గొళ్లెంపెట్టి మార్గదర్శిగా వుంటానికి బయలుదేరింది విశాల ప్రపంచంలోనికి. పడుపు వృత్తిలో మగ్గిపోయే ఎందరు అభాగ్యులను మార్చివేస్తుందో ఆమార్గదర్శి. అదంతా సర్వేశ్వరుని మహిమ!


కటకరసాయనం

బాహ్య, అంతర్గత మూలవ్యాధి చికిత్సకు దివ్యౌషధము. ఇందులో ప్రమాదకరమైనట్టియు, అలవాటుకలుగజేయు ఓషధు లేవియు చేరియుండలేదు. రుచికరంగాను, సులభముగా సేవించుట కనువుగానున్నది. వివరములకు:

కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్

మద్రాసు _ 14.